ప్రజాశక్తి

సోమవారం 10 ఏప్రిల్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పశ్చిమ ప్రాంతంపై ఇద్దరు అధినేతల దృష్టి

- 12న సిఎం జగన్..
  19 న చంద్రబాబు రాక
- ఎన్నికల్లో వెలుగొండ ప్రాజెక్టు
  లబ్ధి దక్కేదెవరికో..





ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పశ్చిమ ప్రాంతంపై సిఎంజగన్.. ప్రతిపక్ష నేత చంద్రబాబు దృష్టి సారించారు. హఠాత్తుగా ఇద్దరి పర్యటనలు ఈనెలలోనే ఖరారయ్యాయి. ఈప్రాంతంపై ఇద్దరు ప్రత్యేక దృష్టి సారించారనే చర్చ రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఈనెల 12న మార్కాపురం పట్టణానికి సిఎం జగన్ వస్తున్నారు. ఈబీసీ లబ్ధిదారులకు ఆయన ఇక్కడ నుంచి ఖాతాల్లో డబ్బులు వేసే కార్యక్రమానికి రానున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగంతోపాటు మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రత్యేక దృష్టిపెట్టి ఏర్పాట్లపై నిమగ్నమై ఉన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు రెండు పర్యాయాలు సిఎం జగన్ గతంలో వచ్చారు. తర్వాత వైపాలెం మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటికి వచ్చారు. ఇపుడు మార్కాపురం పట్టణానికి వస్తున్నారు. పశ్చిమాన ప్రస్తుతం వైసిపికి అనుకూలంగా ఉంది. గత ఎన్నికల్లోనూ అన్ని స్థానాలు దక్కాయి. అక్కడున్న సామాజికవర్గ పరంగానూ వైసిపికి మంచి పట్టు లభించింది. తెలుగుదేశం ఈప్రాంతంలో వైసిపి వచ్చాక అనివార్యంగా బలహీనపడింది. సమీకరణలు మారిపోయాయి. వైసిపికి ప్రస్తుతం కూడా కంచుకోటగానే ఉందనే అంచనాలున్నాయి. దీన్ని మరింత నిలబెట్టుకునేందుకు ఈప్రాంతంలో ఎక్కువ స్థానాలు దక్కించుకునేందుకు సిఎం జగన్ దృష్టిసారించారనే చర్చ ఉంది. ఉన్న స్థానాలను కాపాడుకునే వ్యూహంలో భాగంగా ఆయన ఈప్రాంతంపై దృష్టి సారించారు. మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను కేబినెట్‌లో కొనసాగేలా చూశారు. ఇక్కడ కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును అన్ని రకాలుగా ఎన్నికల్లో వాడుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీనికి పునాదిరాయి చంద్రబాబు వేసినా ఆయన అధికారంలో ఉన్నంతకాలం పనులు మాత్రం చేపట్ట లేదు. దీంతో ఆయనకు వెలుగొండ ప్రాజెక్టుపై శ్రద్ధలేదనే చర్చ రైతుల్లోనే కాకుండా ఆ ప్రాంత ప్రజాప్రతి నిధుల్లోనూ బలంగా నాటుకు పోయింది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దీని పనులు ప్రారంభించారు. రెండు సొరంగాలు కూడా పనులు చేపట్టారు. రెండో సొరంగం కోసం అప్పట్లో సిపిఎం కూడా పోరాటం చేపట్టింది. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న బీవీజ రాఘవులు కూడా పొదిలి మార్కాపురం ప్రాంతాల్లో పర్యటించారు. రైతులను సమీకరించి ఆందోళనలు చేపట్టారు. దీంతో వెంటనే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రెండో సొరంగాన్ని చేపట్టారు. వైఎస్ హయాంలో పనులు వేగంగాసాగాయి. తర్వాత ▶ 2లో



చీరాలలో గడప గడపకూ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు

విడుదల కాని

‘గడప గడపకూ’ నిధులు

- అరకొర బిల్లుల మంజూరుతో
  ముందుకు సాగని పనులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచి వాలయాల పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బిల్లులు మంజూరులో జాప్యం లేకుండా చూస్తామని చేస్తామని సాక్షాత్తూ సిఎం జగన్ రాష్ట్ర వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జుల సమావేశంలో హామీ ఇచ్చారు. సిఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా పాత పద్ధతిలో బిల్లుల చెల్లింపులు చేస్తారని తెలిపారు. నిధులు కావాలంటే ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు తమ నియోజక వర్గాల్లో గడప గడపకూ తిరగాల్సి ఉంటుందన్నారు. సచివాలయాల పరిధిలోని అన్ని సందర్శన పూర్తయ్యాక అక్కడ అభివృద్ధి పనులు చేపట్టేలా, అనుమతులు ▶ 2లో

భానుడి భగభగ..

- ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి
- మధ్యాహ్నం నుంచే
  రహదారులు నిర్మానుష్యం
- వ్యవసాయ కూలీలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భానుడు భగభగమంటున్నాడు. నిప్పుల కుంపటిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. ప్రతిఏటా మార్చిలోనే ఎండల ప్రభావం ప్రారంభం కావడం సహజమే. ఏప్రిల్ నాటికి కొద్దిమేర పగటి ఉష్ణోగ్రత పెరిగేది. ప్రస్తుతం అంచనాలకు మించి ఎండల తీవ్రత కనిపిస్తోంది. గత ఐదు రోజులుగా ఎండల ప్రభావం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగు తున్నాయి. పగలు ఎండలు, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 నుంచే ఇంట్లో ఉక్కపోత, బయటకు వస్తే నడినెత్తిన మంట తప్పడం లేదు. మధ్యాహ్న సమయంలో ఎండలు కొలిమిని తలపిస్తున్నాయి. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మా నుష్యంగా మారుతున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈ నెల 4న 35 డిగ్రీలు, 5, 6 తేదీల్లో 36 డిగ్రీలు, 6, 7, 8 తేదిల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 9న 38 డిగ్రీలు నమోదైంది.



మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారిన రహదారి



వ్యవసాయ పనులకు బ్రేక్..

ఎండ వేడిమికి వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రంగా ఉండటంతో కూలీలు పనులకు రావడం లేదని చెబుతున్నారు. దీంతో వ్యవసాయ బోరు, బావుల కింద ▶ 2లో



పాదయాత్రలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నేతలు

లోకేష్‌కు ఉమ్మడి జిల్లానేతల సంఘీభావం

అనంతపురం వెళ్లి పాదయాత్రలో నడిచిన నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు ఆదివారం పాల్గొన్నారు. లోకేష్‌కు సంఘీభావంగా అందరూ చేయి కలిపారు. అనంతపురం జిల్లా శింగనమాల నియోజకవర్గంలో పాదయాత్రలో పాల్గొని లోకేష్‌తోపాటు నడిచారు. ఆయన చేయిపట్టుకుని ముందుకు సాగారు. లోకేష్ బసచేసిన శిబిరం వద్ద ముందుగానే లోకేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా నేతలతో లోకేష్ ఆప్యాయంగా మాట్లాడారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. అందరినీ పేరుపేరున పిలిచి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్, ఎమ్మెల్యేలు డాక్టర్ డోలా శ్రీవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, బిఎన్.విజయకుమార్,ఇన్‌ఛార్జులు గూడూరి ఎరిక్షన్‌బాబు, ఎంఎం. కొండయ్య, ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు దామచర్ల సత్య, ఇంటూరి రాజేష్, ఆయా నియోజక వర్గాల సరిధిలోని టిటిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంతంపై ఇద్దరు అధినేతల దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వంలో రోశయ్య, కిరణ్‌కుమారెడ్డి హయాంలో పనులు వేగంగా సాగలేదు. 2014లో చంద్రబాబు వచ్చాక కాంట్రాక్టర్ల మార్పు ప్రక్రియతో పనులు ఆశించినమేర సాగలేదు. ఐదేళ్లూ పనులు నత్తనడకనే సాగాయి. ఆయన పలుమార్లు దీన్ని తానే ప్రారంభిస్తామని చెప్పినా ఆ పని చేయలేక పోయారు. ఇపుడు జగన్ సిఎం అయ్యాక కూడా పనులు ఆశించినంత వేగంగా లేవనే చెప్పాలి. నిర్వాసితులకు ప్యాకేజీలు నాలుగేళ్లుగా పెండింగులోనే పెట్టారు. ఈఏడాది సెప్టెంబరులో దీన్ని ప్రారంభించాకే ఎన్నికలకు పోతామని చీమకుర్తి సభలో చెప్పారు. అయితే అందుకు తగ్గట్టుగా నిధులు లేవు. 12 గ్రామాలు ఖాళీ చేశాకే సాధ్యమవుతుంది. మరో నాలుగు నెలల్లో ఇదంతా జరుగుతుందా? అంటే సందేహంగానే ఉంది. మార్కాపురం పర్యటనలోనూ ఆయన వెలుగొండపైనే ప్రధానంగా మాట్లాడే అవకాశం ఉంటుంది. ఇతర అంశాలకు అంతగా ఈప్రాంతంలో ప్రాధాన్యత లేదు. వెలుగొండపైనే ఆయన కీలక ప్రకటన చేయనున్నారన్నది స్పష్టం. నిధులు కేటాయించి ప్యాకేజీలు ఇచ్చాకే దీన్ని ప్రారంభిస్తారా? లేక ఎన్నికల కోసం తంతుగా ప్రారంభం పెడతారా?అనేదీ తేలాల్సి ఉంది. 70 శాతం పనులు కాంగ్రెస్, వైసిపి హయాంలోనే జరిగినందున ఇక్కడ రైతుల్లో ప్రస్తుతం వైసిపిపైనే ఆశలు ఎక్కువగా ఉన్నాయి. నిర్వాసితులు మాత్రం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.వారికి తగిన న్యాయం జరగలేదు. జాబితాల్లోనే అనేక అక్రమాలతోపాటు వడపోతలు జరిగాయి. ఈ సమస్యలను ఎలా పరిష్కారం చేస్తారనేదీ చూడాలి.

ఇక చంద్రబాబు ఈ ప్రాంతంలో చెప్పుకోవడానికి ఎజండా ఏమిటంటే వెలుగొండ ప్రాజెక్టుకు తానే పునాదిరాయి వేశానని చెప్పడం తప్ప ఏమీలేదు. అవకాశం ఉన్నా ఐదేళ్లలో దాన్ని పూర్తి చేయలేక పోయారు. అయితే వైసిపి ప్రభుత్వంలోనూ నాలుగేళ్ల పనులు సాగడమే తెలుగుదేశం నేతలకు ఊరట కలిగించే అంశం. ఈకాలంలో స్థానిక నేతలు కూడా వెలుగొండ కోసం ఆందోళనలు చేపట్టారు. వీటి వల్ల వైసిపి కొంత ఇరకాటం లోనూ పడాల్సి వచ్చింది. చంద్రబాబు గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గ కేంద్రాల్లో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. మార్కాపురం జిల్లా విషయంలోనూ గతంలోనే తెలుగుదేశం నేతలు ప్రకటన చేశారు. దీన్ని ఎలా ఉపయోగించుకుంటారనేదీ చూడాలి. ఆయన మళ్లీ జిల్లాను ప్రస్తావిస్తారా? అనేదీ చూడాలి. ఈ ఎజండా కొంత మేలు చేయనుంది. దీని కోసం ఈప్రాంతంలో ఆందోళనలు జరిగాయి.

మార్కాపురం జిల్లాను చేయడంలో వైసిపి మొండిగానే వ్యవహరించిందనే అపవాదూ ఉంది. గతంలో గిద్దలూరు, కంభం, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. 2004 తర్వాత ఈ ప్రాంతంలో బలహీనపడింది. మళ్లీ పూర్వవైభవం కోసం చంద్రబాబు ఈప్రాంత నేతలతో చేసే వ్యూహం ఏమిటనేదీ చూడాలి.పార్టీకి బలమైన నేతలే ఇపుడు ఉన్నారు. సమీకరణలపైనే కేంద్రీకరించి మళ్లీ చేజారిన వర్గాలను తిరిగి తమవైపు తిప్పుకునే వ్యూహరచనపైనే దృష్టి సారించారని సమాచారం. ఏదేమైనా పశ్చిమాన పట్టుకోసం రెండుపార్టీలు వేగంగానే పావులు కదుపుతున్నాయి.

అనివార్య కారణాలతో వేలం వాయిదా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో గుడ్‌విల్ ఆక్షన్ పద్ధతిపై కూరగాయల మార్కెట్ ప్రదేశంలో నిర్మించనున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, తర్లుపాడు రోడ్డులోని ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నిర్మించనున్న కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ షెడ్ల కోసం ఈ నెల 12న నిర్వహించాల్సిన వేలం పాటలు అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కమిషనర్ గిరికుమార్ ఆదివారం తెలిపారు. వేలం పాట తేదీని త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

వరిగడ్డి కొరతతో అవస్థలు

భారంగా పశుపోషణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయ యాంత్రీకరణ అన్నదాతలకు లాభదాయకంగా ఉన్నా దీని కారణంగా పాడి రైతులపై ప్రభావం పడుతోంది. గతంలో వరి పంటను కూలీలు కోసేవారు. దీంతో గడ్డి పుష్కలంగా లభించేది. ప్రస్తుతం అధిక శాతం మంది కర్షకులు వరికోత యంత్రాలు వాడడంతో పశుపోషకులకు వరిగడ్డి దొరకడం లేదు. దీని వల్ల పాడిరైతులు అధిక ధరలు వెచ్చించి దూరప్రాంతాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి రావడంతో ఎగుమతి, దిగుమతి, రవాణా ఖర్చులు కలిపి మరింత భారంగా మారింది.

గతంలో ఇలా..

పశుగ్రాసం కొరత ఏర్పడుతుందన్న ముందుచూపుతో గత ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి చేయూతనిచ్చింది. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు వార్షిక, ఏకవార్షిక గడ్డి విత్తనాలు, నారు అందించి క్షేత్రాల పెంపకానికి రైతులకు సహకారం అందించింది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం వాటికి స్వస్థిపలకడంతో పాడిరైతులకు అంతకంతకు పశుపోషణ భారం మారింది. గత ప్రభుత్వం



విక్రయానికి తెచ్చిన వరిగడ్డ

పాడిరైతులకు పశుగ్రాస విత్తనాలు సరఫరా చేయడమే కాకుండా పశుగ్రాస క్షేత్రాల పెంపకాన్ని ప్రోత్సహించింది. నేటి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు.

వరి గడ్డి ధరకు రెక్కలు..

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని అనేక గ్రామాల్లో పాడిపై అత్యధిక మంది జీవనం సాగిస్తారు. పశు సంవర్ధకశాఖ గణాంకాల ప్రకారం యర్రగొండపాలెం మండలంలో 4000 ఆవులు, ఎద్దులు, కోడె దూడన్నాయి. 18 వేలు గేదెలున్నాయి. 60 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. పుల్లలచెరువు మండలంలో 4500 ఆవులు, ఎద్దులు, కోడె దూడలు, 20 వేల గేదెలు, దున్నపోతులు, 65 వేల మేకలు, గొర్రెలున్నాయి. రెండు మండలాల్లో 15 వేల ఎకరాల్లో వరిసాగవుతోంది. అయితే ఆ గడ్డి పశువులకు సరిపోయే పరిస్థితి లేదు. దీనికి తోడు యంత్రాల వినియోగంతో పశువులకు సరిపడా గడ్డి దొరకడం లేదు. ఒక్కో పశువుకు రోజుకు మూడు నుంచి ఐదు కిలోల వరకు గడ్డి అవసరం అవుతోందని పశుపోషకులు చెబుతున్నారు. కూలీలు రవాణా ఖర్చులతో కలిపి ట్రాక్టర్ గడ్డికి రూ.13 వేల నుంచి రూ.16 వేలు వరకు ఖర్చు కావడంతో పాడి రైతులకు భారంగా మారింది. ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాలను తిరిగి ప్రోత్సహించాలని పశుపోషకులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బంది

భవనాసి జయమ్మ, పశు పోషకురాలు, యర్రగొండపాలెం



నాకు మూడు పశువులున్నాయి. పశుగ్రా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దాణ ధరలు సైతం గణనీయంగా పెరుగుతున్నాయి. పాడి పశువుల పోషణ భారంగా మారింది. గిట్టుబాటు కావడం లేదు. రాయితీపై విత్తనాలు అందించి క్షేత్రాల సాగుకు చేయూత అందించి ఆదుకోవాలి.

పశువులు అమ్ముకున్నాను

వెంకటేశ్వర్లు నాయక్, పశు పోషకుడు, పిల్లికుంట తండా



నాలుగు గేదెలు, పది తెల్ల పశువులు ఉన్నాయి. వరిగడ్డి ధరలు పెరగడంతో వాటి పోషణ భారంగా మారింది. దీనికి తోడు నల్లమలలో కూడా గడ్డి లభించడం లేదు. గత్యంతరం లేక పశువులను వచ్చిన ధరకే విక్రయించుకున్నాను.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

డాక్టర్ ఉడుముల శివారెడ్డి, ప్రభుత్వ పశువైద్యాధికారి, యర్రగొండపాలెం



ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా పాడి రైతులకు రాయితీపై టిఎంఆర్ దాణా సరఫరా చేస్తున్నాం. 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నాం. పశు గ్రాస కొరతపై ఉన్నతాధికారులకు నివేదించి వారి సూచనలతో చర్యలు తీసుకుంటాం.

భానుడి భగభగ..

(మొదటి పేజీ తరువాయి)

పంటలు సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంత ఎండలు ఎప్పుడూ చూడలేదు

కేసానుపల్లి సుబ్బమ్మ, గృహిణి, యర్రగొండపాలెం



ప్రస్తుతం ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఎప్పుడూ ఇంత ఎండలు చూడలేదు. ఉదయం 9 గంటల తర్వాత బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో ఉంటే ఉక్కపోత తప్పడం లేదు. చిన్న పిల్లలు, వద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బయటకు రావాలంటే భయమేస్తోంది

ఊట్ల సుబ్బారావు, స్టాంప్ రైటర్, మిట్టపాలెం



పెరిగిన ఉష్ణోగ్రతలతో వడగాలులు అధికమయ్యాయి. ఉదయం 11 గంటల తర్వాత బయటకు రావాలంటేనే భయమేస్తోంది. ఇప్పుడే ఇలా ఉండే మేలో ఎండలు ఎలా ఉంటాయోనని భయమేస్తోంది. ఉక్కపోత కూడా పెరిగింది.

జాగ్రత్తలు తీసుకోవాలి

డాక్టర్ ఎం శ్రీనివాసరావు, ఐటిడిఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ



వేసవిలో దూర ప్రాంతాలు ప్రయాణం చేసేవారు. కూలీ పనులకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఎండలు ఎక్కువగా ఉన్నందున వేసవి తాపం తగ్గించాలంటే చిన్నారులు, వద్ధులకు నీరు ఎక్కువగా తాగించాలి. ఒఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలి.

విడుదల కాని 'గడప గడపకూ' నిధులు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చేలా ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం జోడించింది. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు గడప గడపకూ తిరుగుతున్నారు. ఆయా సచివాయాల పరిధిలో తమ పర్యటనలు పూర్తయ్యాక అభివృద్ధి పనులు చేప డుతున్నారు. ఈ నిధులతో చేపట్టే రూ.5 లక్షల లోపు పనులను టెండర్లు వేయడం కాకుండా నామినేషన్ పద్ధతిలో చేపట్టే అవకాశం ఉంది. దీంతో వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధుల ద్వారా పనులు చేపట్టారు. పనులు పూర్తవుతున్నాయి కాని బిల్లులు మాత్రం మంజూరు కావడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల మాటలు నమ్మి లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పనులు చేపట్టిన చోటా మోటా వైసిపి నేతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బాపట్ల జిల్లాలోని చీరాల పురపాలక సంఘంలో రూ.5 కోట్ల విలువైన పనులు పూర్తి అయ్యాయి. కేవలం రూ.51 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. బాపట్లలో రూ.4 కోట్ల పనులు పూర్తి కాగా రూ.74 లక్షలు మంజూరయ్యాచయి. రేపల్లెలో రూ.3 కోట్ల పనులు కాగా రూ.35 లక్షలు, అద్దంకిలో రూ.2 కోట్ల పనులు కాగా రూ.19 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. రెండేళ్ల క్రితం నియోజకవర్గాల్లో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్ర భవనాలను రాష్ట ప్రభుత్వం మంజూరు చేసింది. వైసిపి నాయకులు భవన నిర్మాణాలు పూర్తి చేశారు. ఒక్కొక్క భవన నిర్మాణం కోసం నేతలు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేశారు. నేటికీ సగం బిల్లులు కూడా మంజూరు కాలేదు. ఏడాదిగా ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలకు సంబంధించి బిల్లులు నిలిచిపోయాయి. దీంతో ఆ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. బిల్లుల మంజూరులో జాప్యం ఉండదని చెప్పడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల గృహాల సందర్శన తరువాత పనులు ప్రారంభించారు. రూ.5 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిలో చేపట్టారు. రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచారు. జిల్లాలో కోట్ల రూపాయల పనులు పూర్తి చేశారు. పురపాలక సంఘాల పరిధిలో పనులు చేపట్టేందుకు ఆన్‌లైన్ అనుమతులు వచ్చాయి. చేసిన పనులు అప్‌లోడ్ చేసే విధానంలో జాప్యం జరిగింది. పూర్తయిన పనుల బిల్లులను ఎలా, ఎక్కడ అప్‌లోడ్ చేయాలో ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ప్రారంభంలో నేరుగా ట్రెజరీ ద్వారా చెల్లింపులు అన్నారు. తరువాత సిఎఫ్ఎంఎస్ ద్వారా అని చెప్పారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలోని 25 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పురపాలక శాఖల ద్వారా గడప గడపకూ పనులు చేపట్టారు. అప్‌లోడ్ చేయడంలో వివిధ సాంకేతిక సమస్యలు నెలకొన్నాయి. దీంతో పూర్తయిన పనులకు సంబంధించి పూర్తి బిల్లులు ఎప్పుడు వస్తాయో అర్థం కాని పరిస్థితి ఉంది.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

నలుగురు అరెస్టు



విందితులను విలేకరులకు చూపుతున్న పోలీసులు.. మాట్లాడుతున్న ఎస్ఇబి ఆవులయ్య

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలో అక్రమ మద్యం రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 648 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సూపరింటెండెంట్ ఎ ఆవులయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఇబి కార్యాలయం వద్ద ఆయన సిఐ సుందరరామయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. తూర్పుగంగవరానికి చెందిన గుజ్జుల బాలకృష్ణారెడ్డి, రామభద్రాపురానికి చెందిన పులి కృష్ణారెడ్డి, గంగిరెడ్డి సుబ్బారెడ్డిలు, నెల్లూరుకు చెందిన శ్రావణ్‌కుమార్‌లు అక్రమంగా మద్యంను తక్కువ రేట్లకు గోవా, హర్యానా, హైదరాబాదుల నుంచి తెప్పించి అధిక రేట్లకు అమ్ముతున్నట్లు ఆయన తెలిపారు. తమకు తెలిసిన సమాచారాన్ని బట్టి బాలకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారించగా 60 బాటిళ్లు తమ వద్ద ఉన్నాయని, నెల్లూరుకు చెందిన శ్రావణ్‌కుమార్ వద్ద నుంచి కారులో అక్రమంగా మద్యం తెప్పించి అమ్ముతుంటారని తెలిపారు. నెల్లూరులో దాడులు చేయగా 49 కేసులు దొరికాయన్నారు. మొత్తం 648 మద్యం బాటిళ్లు, 2 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.5,23,000 అని ఆయన తెలిపారు. వారి వద్ద మోటారుసైకిల్, కారును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజపరుస్తామన్నారు. ఈ అక్రమ మద్యం కేసును చేధించిన సిఐ సుందరరామయ్య, చీమకుర్తి ఎస్ఐ నగేష్, దరిశి కానిస్టేబుల్స్ బాషా, దస్తగిరి, సుబ్బారావు, శ్రీనివాస్, రామిరెడ్డిలను ఆవులయ్య అభినందించారు.


వృథాగా పడిఉన్న ఆటోలు

తుప్పు పట్టిన ఆటోలు.. నెరవేరని లక్ష్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

గత ప్రభుత్వం.. అప్పట్లో చెత్త సంపద తయారీ కేంద్రాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మండలంలోని ప్రతి గ్రామానికి ఒక చెత్త సంపద కేంద్రాన్ని పెట్టి దాని ద్వారా పంచాయతీకి ఆర్థిక సంపద సృష్టించాలని ధ్యేయంతో పనిచేసింది. గ్రామాలలో కేంద్రాలకు చెత్తను సరఫరా చేయడానికి ఆటో రిక్షాలను ఇచ్చేందుకు ప్రయత్నం చేసింది. వాటిని మండల కేంద్రాలకు చేర్చారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆటో రిక్షాల పంపిణీ ఆగిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆటోలను పంచాయతీకి అప్పగించలేదు. అవి ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పట్టిపోతున్నాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో 13 గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు లక్షలాది రూపాయిల వ్యయంతో నిర్మించారు. మరికొన్ని నిర్మాణం దశలో ఉన్నాయి. కేంద్రాలకు చెత్తను తీసుకుపోవడానికి చెక్క రిక్షాలను మాత్రమే వాడుతున్నారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు నెల నెలా జీతాలు కూడా చెల్లించడం లేదని, రిక్షాకు పంచరు పడితే వారే ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆటోలలోని బ్యాటరీని ఇప్పటికే అపహరించుకుపోయారు. టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పనిని వైసీపీ ప్రభుత్వం నీరుగార్చిందని ప్రజలు విమర్శిస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు కూడా పై కప్పులు లేచిపోయి పగలే ఆకాశాన్ని చూపిస్తున్నాయి. అధికారులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు


వినియోగంలో లేని మరుగుదొడ్లు

ప్రజాశక్తి-మద్దిపాడు

లక్షలు వెచ్చించి నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా పడిఉన్నాయి. ఈ ఏడాదయినా వీటిని ప్రారంభిస్తారా లేదా అని ప్రజలు గొణుగుతున్నారు. టీడీపీ హయాంలో సుమారు రూ.5 లక్షలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ మరుగుదొడ్లు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లను ప్రారంభించాలంటే మరలా ప్రభుత్వం మారాలా అంటూ సెటైర్లు వేస్తున్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్, సచివాలయం, విద్యావనరుల కేంద్రం అన్నీ ఒకే ఆవరణలో ఉన్నాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీల నుంచి వివిధ పనుల నిమిత్తం అనేకమంది ప్రజలు నిత్యం రాకపోకలు జరుపుతారు. ముఖ్యంగా మహిళలు కూడా తమ పనుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో వస్తారు. ఈ నేపథ్యంలో వారు గంటల పర్యాయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. బాత్ రూమ్‌కు వెళ్లాల్సి వస్తే వారి పరిస్థితి దారుణం. ఎక్కడా మరుగు లేని పరిస్థితి. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం అలోచించి ఈ మరుగుదొడ్లు నిర్మించింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేసి ప్రజలను ఇక్కట్లపాలు చేసింది. నాటి నుంచి నేటి వరకు ఏ నాయకుడు గాని, అధికారులు కానీ వాటిని చొరవ తీసుకోలేదు. ప్రజల సొమ్ము వృథా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ రాజకీయ నాయకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరిని ప్రజలు గర్హిస్తున్నారు.


హేండిల్ బిగించని బోరు

నిరుపయోగంగా బోరు

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని బూరెపల్లి నిర్వాసితుల కాలనీలో సుమారు పది బోర్లు గత ఐదు నెలల క్రితం వేశారు. కానీ అప్పటి నుంచి బోర్లకు హేండిల్స్ చైన్‌లు బిగించ లేదు. దీంతో ఆ బోర్లు తమకు ఉపయోగపడటం లేదని కాలనీ వాసులు వాపోయారు. ఈ విషయమై సర్పంచ్‌ని వివరణ కోరగా.. పంచాయతీలో ఎలాంటి ఆర్థిక వనరులూ లేని కారణంగా బిగించ లేదని తెలిపారు. సదరు కాలనీలో మేకలు, గొర్రెలు పెంపకందారులు ఎక్కువ శాతం మంది ఉన్నారని, వారికి నీటి అవసరం ఎంతో ఉందని తెలిపారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని బోర్లకు వెంటనే హేండిల్స్ బిగించాలని గొర్రెలు, మేకల పెంపకందార్లు కోరుతున్నారు.


గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్ ఒక యూనియన్‌కు కొమ్ము కాస్తూ పలు యూనియన్లు నిర్లక్ష్యం చేయడం మంచి పద్ధతి కాదని ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు చిరంజీవి అన్నారు. ఆదివారం ఆర్టీసీ డిపో మేనేజర్ చర్యలకు నిరసనగా డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ పూర్తిగా ఒక యూనియన్‌కి కొమ్ము కాస్తూ సీనియార్టీని పక్కనపెట్టి జూనియర్ మోస్ట్ డ్రైవర్‌కు చార్ట్ బ్లాంక్ ఇచ్చారని విమర్శించారు. అలాగే 281 చార్ట్ బుకింగ్‌లో అవకతవకలపై డిజిటల్ చార్ట్‌లు, అక్రమంగా వాడుతున్న ఓడిలను కూడా జిల్లా సీనియార్టీ ప్రకారం నోటీస్ బోర్డు ద్వారా తీసుకోవాలని అనేకమార్లు మొరపెట్టుకున్నప్పటికీ డిపో మేనేజర్ మొండివైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే రెండు సర్వీసులకు కిలోమీటర్లు పెంచడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.


మహిళ మృతదేహం

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామం పరిధిలోని నాగరాజు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని బాపట్ల రూరల్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మహిళకు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు వయసు ఉండవచ్చని పేర్కొన్నారు. నందిరాజుతోట వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. మృతదేహాన్ని బాపట్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు బాపట్ల రూరల్ ఎస్ఐ సెల్ నెంబరు 9440796258కు తెలియజేయాలని కోరారు.

గాయపడిన బాలిక మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలిక ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా చెప్పిన వివరాల ప్రకారం.. మోటారు బైక్‌పై నలుగురు వెళ్తుండగా సైకిల్‌ని ఢీకొట్టడంతో గాయపడిన వారిని ఒంగోలు హాస్పిటల్‌కి తరలించారు. వీరిలో పులగుర ప్రతిభా పాటిల్(7) అనే బాలికకు సీరియస్‌గా ఉండడంతో గుంటూరు హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. గాయపడిన రేణిమాల కార్తీక్, రాకేష్, చలవని ఒంగోలు రిమ్స్‌లో వైద్యం పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-శింగరాయకొండ: శింగరాయకొండ పంచాయతీలోని చంద్రబాబు నాయుడు కాలనీ వద్ద జామాయిల్ తోటలో పేకాట శిబిరంపై ఆదివారం నాడు ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.5,700ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పంగులూరు ఈసీఐ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు

ఘనంగా ఈస్టర్ పండుగ

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని పంగులూరు, కోటపాడు, చందలూరు, రేణింగవరం, కొండమంజులూరు, బూదవాడ, ముప్పవరం, కొప్పెరపాడు, అరికట్ల వారిపాలెంలలో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మానవుల పాప పరిహారమై శిలువపై నుంచి యేసు చెప్పిన మాటలను క్రైస్తవులు గుర్తు చేసుకున్నారు. ఈ పండుగ సందర్భంగా మండల కేంద్రమైన పంగులూరులోని ఈసిఐ చర్చి పాస్టర్ రవిరాజు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు మరణించి, మూడో దినం పునరుత్థానం అయిన సందర్భంగా ఈస్టర్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని అన్నారు. మానవుల కోసం సిలువలో మరణించి, తన రక్తం చిందించటం ద్వారా పాపాలు కడిగి వేయబడ్డాయని అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆశల పల్లకిలో 'వైట్ బర్లీ' రైతులు

అధిక వర్షాలు ఆర్థికంగా దెబ్బతీశాయని ఆవేదన ● మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పర్చూరు

వైట్ బర్లీ పొగాకు దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. వైట్ బర్లీ నాటిన నుంచి ఈ ఏడాది మంచి ధరలు ఉంటాయనే నమ్మకానికి ఊతమిచ్చినట్లయింది. లోగడ ఎన్నడూ లేని విధంగా నాసిరకం పొగాకు కూడా క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు కూడా కొనుగోళ్లు సాగాయి. దీంతో నాణ్యమైన పొగాకుకు మంచి ధర వస్తుందని రైతన్నలు ఎంతో ఆశపడ్డారు. ఈ తరుణంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు వైట్ బర్లీ సాగు చేసిన పొగాకు రైతన్నల ఆశలపై నీళ్లు చల్లాయి. భారీ వర్షాల వల్ల చేలల్లో ఎండకట్టిన తాళ్లు తడిసిపోవటం, ఆకుల నుంచి మడ్డి కారిపోవడం వంటి కారణాలతో పంట దెబ్బతింది. ప్రైవేటు వ్యాపారులు దీనిని ఆసరాగా తీసుకొని ధరలను మరింత దిగజార్చి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వైట్ బర్లీ



పందిళ్ల వద్ద ఉన్న పొగాకు

పొగాకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉన్నా నాశిరకం అనే పేరుతో ఉన్న ధరలను తగ్గించి ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేపడుతున్నారని వైట్‌బర్లీ రైతులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 30 వేల ఎకరాల్లో రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. ఎకరానికి సాగు ఖర్చులు, పురుగు మందులు కలిసి మొత్తం లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేశారు. అయితే పెట్టుబడులు ఎక్కువైనప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండటంతో వైట్‌బర్లీ వేసిన రైతులు కొంత ఊరట చెందారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇటీవల కురిసిన అధిక వర్షాలు వైట్ బర్లీ రైతులను కొంత ఆర్థికంగా కుంగదీశాయి.

మద్దతు ధర ప్రకటించాలి

రైతు సంఘం జిల్లా నాయకులు బండి శంకరయ్య

ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వైట్ బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ప్రైవేటు వ్యాపారస్తులు ధరలు తగ్గించి కొనుగోలు చేయకుండా మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలి. మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే అన్నదాత ఆశలు అడియాసలయ్యే ప్రమాదం ఉంది.

నమ్మకం ప్రజలకా? వైసీపీ నాయకులకా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు



మాట్లాడుతున్న సాయిబాబా

జగనే మా నమ్మకం, మా భవిష్యతు అన్న నినాదం ప్రజలదా లేక వైసిపి నాయకులదా అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజలకు నమ్మకం ఉంటే వారే గర్విస్తారని ఇష్టం లేకపోయినా ప్రజల వద్దకు వెళ్లి బలవంతంగా ఆ పార్టీ నాయకులు స్టిక్కర్లు అంటించే దుస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ఎన్ని రకాలుగా ప్రజలను మభ్యపెట్టాలని చూసిన నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇంటికి అంటించిన స్టిక్కర్ చించివేస్తే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని బెదిరించడం సరికాదన్నారు. అలాంటి బెదిరింపుల వల్ల మరింత వ్యతిరేకత వస్తుందే తప్ప ఎలాంటి మార్పు రాదని రానున్న ఎన్నికలలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, బసవపున్నయ్య, లెనిన్ తదితరులు ఉన్నారు.


సుబ్రహ్మణ్యంకు కళా పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి



కాజా వెంకట సుబ్రహ్మణ్యం

ఉత్తమ నాట్యాచార్యునిగా, నటునిగా, గాయకునిగా, వ్యాఖ్యాతగా, నృత్యసాహిత్య విశ్లేషకునిగా, నత్య నాటక సంగీత రూపక కర్తగా, నృత్య నాటకకర్తగా, అఖిలాంధ్ర కోటికి సుపరిచితులైన డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యంకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల ఛారిటబుల్ ట్రస్ట్ వారి కళా పురస్కారం లభించింది. గత 40 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు కూచిపూడి నృత్య విద్యను నేర్పిస్తున్న ఆయనకు ఈ పురస్కారాన్ని ఈ నెల 14వ తేదీన శుక్రవారం సాయంత్రం 6గంటలకు స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత మాధవస్వామి వారి దేవాలయంలో ఇవ్వనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. వీరికి పురస్కార ద్రవ్యంగా రూ.10 వేలు, పట్టుబట్టలు, అభినందన పత్రం, జ్ఞాపిక అందించనున్నారని తెలిపారు.



పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

ఎంజెఆర్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేటపాలెం

విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఎంజెఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ శ్రీనివాస్ ఆచారి హాజరయ్యారు. కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల చైర్మన్ నారిపెళ్ల ప్రకాష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక పరిజ్ఞానంతో పాటు శారీరక దృఢత్వం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులను సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమానికి చల్లారెడ్డిపాలెంలోని ఎంజీఆర్ విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ రాధాకృష్ణకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అమరావతి ఒలంపియాడ్ సంస్థల ప్రతినిధులు "ఆచార్య దేవోభవ అవార్డుకు" ఎంపికైన నారిపెల్ల ప్రకాశరావుకు బహుమతి ప్రశంసా పత్రాన్ని అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రిన్సిపాల్ రాధాకుమారి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఆలీ, నరసింహారావు, సుభాని, రాధాకుమారి, డైరెక్టర్ తులసికృష్ణ, ఉపాధ్యాయులు ప్రశాంత్, సునీత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లోకేష్ కలిసి నడుస్తున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

లోకేష్ పాదయాత్రలో ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

టిడిపి యువనేత నారా లోకేష్ పాదయాత్రలో బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో లోకేష్‌తో పాటు ఏలూరి పాల్గొనడం కార్యకర్తల్లో జోష్ నింపింది. ఈ పాదయాత్రలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు. నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి లోకేష్ చేపట్టిన పాదయాత్రకు అనూహ్య స్పందన లభించడం పట్ల నేతలు యువనేత లోకేష్‌ను అభినందించారు.



సాయమందిస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

తాపీ కార్మికుడికి ఫ్రెండ్స్ యూత్ సాయం

ప్రజాశక్తి-బాపట్ల

తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలపాలైన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ తోడుగా నిలిచింది. పట్టణంలోని ఉమ్మారెడ్డి సరోజినీదేవి కాలనీకి చెందిన శ్రీపతి అయ్యప్ప తాపీ పని చేసే సమయంలో పరంజాపై నుంచి కిందపడి కాలి ఎముక విరిగి తీవ్రగాయాలపాలై గత నెల రోజులుగా పనికి వెళ్లలేని స్థితిలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. దీంతో బాధిత కుటుంబానికి తమ ఆర్గనైజేషన్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు తెలిపారు. దాతలు ముందుకొచ్చి బాధితుడిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్బారావు, ట్రెజరర్ సువర్ణరాజు, సభ్యులు నరాలశెట్టి నాగరాజు, విన్నకోట శ్రీనివాసరావు, భీమా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల సిండికేట్.. మొక్కజొన్న ధర పతనం

ప్రజాశక్తి-పంగులూరు

నిన్న మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, గత పది రోజుల నుండి రోజురోజుకు తగ్గిపోతుంది. ప్రభుత్వ ధర కన్నా, ప్రైవేటు వ్యాపారుల ధర బాగుందని రైతులు ఆశిస్తున్న నేపథ్యంలో, ధరలు తగ్గిపోవటం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తుంది. మొదట్లో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, రోజురోజుకూ పతనం అవ్వటం పట్ల వ్యాపారుల సిండికేట్ ప్రభావం ఉందని, పలువురు మొక్కజొన్న రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం రబీలో మొక్కజొన్న పైరును పంగులూరు మండలంలో 4,600 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వాతావరణం అనుకూలించటం వలన ప్రారంభం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పైరు బాగానే ఉంది. ఎలాంటి చీడపీడలు కూడా ఆశించకపోవడంతో ఈ సంవత్సరం దిగుబడులు బాగానే ఉంటాయని రైతులు భావించారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. నెల రోజులు ముందు ప్రైవేటు ధర కూడా బాగా ఉంది. ప్రభుత్వ ధర 1,960 రూపాయలు కాగా, ప్రైవేట్ వ్యాపారుల ధర రూ.2,200 వరకు ఉంది. దీంతో మొక్కజొన్న రైతులు మంచి లాభాలు వస్తాయని



పంగులూరు మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు

ఆశించారు. గత 20 రోజులు నుంచి మొక్కజొన్న పండి రైతుల ఇళ్లకు చేరుకోవడంతో మొక్కజొన్న ధర పతనం ప్రారంభమైంది. రోజురోజుకూ ధర తగ్గుతూ ప్రస్తుతం 1,960 రూపాయలకు చేరింది. రాబోయే రోజుల్లో ఇంకా ధర తగ్గే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ధర ఎంత ఉందో, ప్రైవేట్ ధర కూడా అంతే ఉంది. మొక్కజొన్న ఒక్కసారిగా రైతుల ఇళ్లకు చేరటం, రైతులు వ్యాపారుల చుట్టూ తిరగటం వలన వ్యాపారులు సిండికేట్ అయి, ధరలు తగ్గించడం ప్రారంభించారని రైతులు చెబుతున్నారు. రానున్న పది రోజుల్లో కూడా మిగిలిన మొక్కజొన్న రైతులు వద్దకు చేరే అవకాశం ఉందని, దీన్ని ఆసరాగా తీసుకొని ఇంకా ధర తగ్గించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని, రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టారు. కౌలు ధరలు కూడా ఎక్కువగా పెట్టి మొక్కజొన్నలు సాగు చేశారు. అయితే ధరలు తగ్గిపోవడం రైతాంగాన్ని, కౌలు రైతాంగాన్ని నష్టాలు పాలు చేసే విధంగా ఉన్నాయని పలువురు చెబుతున్నారు.

ప్రభుత్వం కొనకపోవడమే కారణం: రైతు సంఘం

ప్రైవేట్ వ్యాపారులు మొక్కజొన్న ధరను రోజురోజుకూ తగ్గించడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టకపోవటమే కారణమని, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేస్తే ,ప్రైవేట్ వ్యాపారులు ధరలు తగ్గించే వారు కాదని, ప్రభుత్వం కొనుగోలు చేసే ఆలోచన చేయటం లేదని అన్నారు. ప్రైవేట్ వ్యాపారులు రైతుల అవసరాలను, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఇంకా ధర తగ్గించే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కొనుగోలు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రభలపై నాయకుల సందడి

ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీలోని సోమవరప్పాడు సమీపాన ఉన్న గుంటిగంగమ్మ భవాని అమ్మవారు తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి, టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజలు ఏర్పాటు చేశారు. ప్రభలపై ఆయా పార్టీల నాయకులు రాజకీయ ప్రసంగాలతో సందడి చేశారు. తాళ్లూరు, శివరామపురం, నాగంబొట్లవారిపాలెం గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాళ్ళూరు పంచాయతీ పరిధిలోని కొత్తపాలెంలో జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి



ప్రభపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు



ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెటి వేణుగోపాల్

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ, మాధవరంలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ, శివరామపురంలో నిశకం హనుమంతరావు, మద్దిశెట్టి అభిమానులు ఏర్పాటు చేసిన ప్రభ, రమణాలవారిపాలెం మద్దిశెట్టి అభిమానులు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వర్షాలు బాగా పడి రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడూ కరువేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నట్లు తెలిపారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. లక్కవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ, శివరామపురం టిడిపి నాయకులు చేసిన తడిక ప్రభపై దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు,



ప్రభపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జి పమిడి రమేష్ మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా లేరని తెలిపారు. రాష్ట్రంలో విధ్వంసకపాలన సాగుతుందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, మాజీ ఎంపిపిలు పోశం మధుసూధనరెడ్డి, కోటా రామిరెడ్డి, గోళ్లపాటి మోషే, నాయకులు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఆంజనేయరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జయరామిరెడ్డి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, ఎం. రమేష్, కోటేశ్వరరావు, రమేష్, వెంకట్రావు, హనుమారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో గ్రానైట్ వ్యర్థాలు

రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి నుంచి పునుగోడు వెళ్లే రహదారిలో నున్న గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వర్థాలను రోడ్డు మార్జిన్‌లో పడవేస్తున్నారు. రహదారి కుచించుకొనిపోయి ప్రమాదాలకు కారణమవుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పివి. శేషయ్య తెలిపారు. గ్రానైట్ వ్యర్థాలను ఫ్యాక్టరీ స్వంత స్థలంలో డంపింగ్ చేసుకోకుండా రోడ్డు ప్రక్కన డంపింగ్ చేస్తున్నా ఆర్అండ్‌బి అధికారులు చోద్యం చూడటం సరికాదన్నారు. గ్రానైట్ పాలిష్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థాలను రైల్వే బ్రిడ్జి వైపు వదులు తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గుర వుతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డు ప్రక్కన గ్రానైట్ వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



రోడ్డు మార్జిన్ పడవేసిన వ్యర్థాలు

అంబేద్కర్ చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాల యాలకు అంబేద్కర్ చిత్ర పటాలను బహూకరిస్తున్నట్లు ఉద్యోగ సంఘం నాయ కులు తెలిపారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా చిత్రపటాలను విశ్రాంత ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బండ్ల డేవిడ్, ఉపాధ్యాయుడు శేషు, గండూరి నాగరాజు బహూకరిస్తున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రామిరెడ్డికి ఆదివారం అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సంఘం నాయకులు అంబేద్కర్ చిత్రపటాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రంలో గోళ్ళ ప్రతాప్,టి. రాజా, ఇస్తర్ల శంకర్, జి.సుబ్బారావు,జి.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి

- కృష్ణా జలాలతో పశ్చిమ ప్రజలను ఆదుకోవాలి
- మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి
- సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి, కృష్ణా నీటిని విడుదల చేయాలని, మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో డికెఎం.రఫి అధ్యక్షతన సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ వెలిగొండ విషయంలో వైసిపి ప్రభుత్వం కూడా మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ళు కావస్తున్నా అతీగతి లేదన్నారు. ఈ ఏడాది కూడా పూర్తవుతుందన్న నమ్మకం లేదన్నారు. పశ్చిమ ప్రాంతంలోని కరవు రైతులపై ఏ మాత్రం వైసిపి ప్రభుత్వానికి ప్రేమ లేదన్నారు. ప్రభుత్వం తలచుకుంటే వెలిగొండ ప్రాజెక్టు చేయడం పెద్ద సమస్య కాదన్నారు. ఈ పాటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అన్ని విధాలుగా అర్హతలు కలిగిన మార్కాపురాన్ని జిల్లా ప్రకటించాలన్నారు. ఈ నెల 12న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం వస్తున్నారని, అక్కడి సభలో వెలిగొండ ప్రాజెక్టుతో పాటు నిర్వాసితుల ప్యాకేజి, మార్కాపురం జిల్లా అంశాలపై ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో మార్కాపురం మున్సిపాలిటీలో భూగర్భ డ్రైనేజీ, మార్కాపురం-రైల్వే స్టేషన్ రోడ్డులో గల చెరువు కట్ట రోడ్డును ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దాన్ని గురించి ఇప్పటికీ పట్టించు కోలేదన్నారు. సిఎం జగన్‌ను నమ్మి ఈ ప్రాంత ప్రజలు ఓట్లేశారని, ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పందీటి రూబెన్, జవ్వాజి రాజు, జి కొండయ్య, షేక్ కరీముల్లా, షేక్ నన్నేసా, లోకేష్, కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమయ్య



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుంటక సుబ్బారెడ్డి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు స్థానిక ఎస్‌సివికె నిలయంం (రీడింగ్ రూమ్) వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని రీడింగ్ రూమ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, ఎఎంసి మాజీ చైర్మన్, రీడింగ్ రూమ్ కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీడింగ్ రూమ్ ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, రీడింగ్ రూమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కాటంరాజు విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పిసిపల్లి

కాటంరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పాలేటి గంగమ్మ గుడి దగ్గర ఆదివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని వెంగళాపురం సమీపంలోనున్న గంగమ్మ గుడి దగ్గర ఏడు అడుగుల కాటంరాజు విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు దేవర వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, నాలి వెంకటేశ్వర్లు, చప్పిడి సుబ్బయ్య,, డాక్టర్ పెరుగు మురళీ కష్ణ, పొంకం ఏడుకొండలు, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, డబ్బుగొట్టు వెంకటరావు, నలగంగు శ్రీను, గంగమ్మ గుడి ధర్మకర్త బొడ్డుబోయిన బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సిఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి : జంకె

ప్రజాశక్తి-మార్కాపురం



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇబిసి నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 12న మార్కాపురం వస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌వికెపి కళాశాల మైదానంలో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలన్నారు. వైసిపి శ్రేణులు సిఎం జగన్ పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గిద్దలూరు

పేదల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మండల పరిధిలోని నరవ గ్రామ సర్పంచి బండి శ్రీనివాసులు తెలిపారు. నరవ గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద బోరు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ జగనన్న కాలనీలో వైసిపి ప్రభుత్వం అని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించనున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి : వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. స్థానిక బుచ్చిరాజుపాలెం, అంబేద్కర్ నగర్ సచివాలయం 1, 2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్. కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సంతప్తిగా ఉన్నారని తెలిపారు. గడప గడపకూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల ఆమోదంతో జగన్ చిత్రంతో ఉన్న స్టిక్కర్లను వారి నివాస గహాల గోడలపై అతికించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు, జెసిఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసీపీ నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, చక్కా రాజేశ్వరరావు, ఎంపిటిసి బొడ్డు వాసంతి, రవీంద్ర, దుగ్గిరాల పేర్రాజు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు పాల్గొన్నారు. **కొండపి :** పేదల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని మండల పరిధిలోని గుర్రపడియ గ్రామ వైసిపి నాయకుడు ఆళ్ల శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గుర్రపడియ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటి యజమానుల అనుమతి మేరకు గృహాలకు జగనన్న స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.


జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వరికూటి అశోక్‌బాబు


జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైసిపి నాయకులు

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి కంభం రూరల్



ప్రస్తుతం ఐపిఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో కంభం, బేస్త వారిపేట, అర్ధవీడు మండలాల పరిధిలో ఎవరైనా క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కంభం సిఐ రాజేష్ కుమార్ హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్‌ల పై ప్రత్యేకంగా దష్టి సారించినట్లు ఆయన చెప్పారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవుడు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో నున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చెన్నకేశస్వామి హనుమంత వాహనంపై ప్రజలకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కాంరపూడి వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా బోడా సింగరప్ప నాయుడు, బోడా ఆంజనేయులు, బోడా తిరుపతి నాయుడు, బోడా చెన్న వీరయ్య, బోడావీరయ్య, బోడా మల్లయ్య వ్యవహరించారు.

గురుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- మార్కాపురంరూరల్

మార్కాపురం రైల్వే స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మతదేహం పడిఉంటాన్ని స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులు, మార్కాపురం రూరల్ పోలీస్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించాడు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేక పోవడంతో రైలు నుంచి జారి పడి మృతి చెందలేదని నిర్ధారించారు. కేసు మార్కాపురం గ్రామీణ పోలీస్టేషన్ పరిధిలోకి వస్తుందని వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం మార్కాపురం గ్రామీణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం రైలు పట్టాలకు 8 అడుగుల దూరంలో పడి ఉందని కేసు తమ పరిధిలోకి రాదంటూ వారు వెనుదిగారు. మృతదేహం ఘటనా స్థలం వద్దే ఉంది. రైల్వే పోలీసులు, మార్కాపురం రూరల్ పోలీసులు తమ పరిధి కాదని ఒకరిపై చెప్పుకుంటూ మృతదేహం గురించి పట్టించుకోక పోవడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటం వద్ద నాయకుల నివాళి

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భూ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ నాయకులు చెన్నయ్య తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి సభ ఆదివారం నిరహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కెవి. కష్ణ గౌడ్, వెంకటాద్రిపాలెం సర్పంచి శ్రీశైలపతినాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది

అగ్ని ప్రమాదంలో జామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి- జరుగుమల్లి

గుర్తుతెలియని వ్యక్తి తాగి పడవేసిన సిగెరెట్ కారణంగా మంటలు చెలరేగటంతో రెండు ఎకరాలలోని జమాయిల్ చెట్లు దగ్ధవ ఎయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నందనవనంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటన గ్రామానికి చెందిన స్వర్ణ పద్మావతికి చెందిన రెండు ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. అగ్ని ప్రమాదం గురించిసమాచారం అందుకున్న టంగుటూరు అగ్నిమాపకం ఎస్ఎఫ్ఓ ఎ.రమణారెడ్డి తన సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ డి.చెన్నారెడ్డి, సిబ్బంది బి.సుబ్రమమణ్యం, పి.ఏసోబు, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకల్లో మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హైదరాబాదులోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఎన్ఎస్‌యుఎస్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ విజయలక్ష్మి, గుజరాత్ ఎస్‌పి సిద్దార్థ్, జార్జి విద్యా సంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

స్థానిక బీసీకాలనీలోనున్న ది లేమేన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్ చిన్నారులు ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఇఎఫ్ చర్చి దైవ సేవకులు బ్రదర్ బొందలపాటి హయ్యర్ జయదేవ్ ఈస్టర్ పండుగ ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, గవర్నమెంట్ మోడల్ డిగ్రీ కాలేజీ ఇంగ్లీష్ లెక్చరర్ పిల్లి ప్రదీప్, చిన్నారుల తల్లిదండ్రులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


చర్చి వద్ద మంత్రి సురేష్ కుటుంబం


ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యార్థులు

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంకు చెందిన నిమ్మక భాగ్యలక్ష్మి అనారోగ్య కారణంగాకోమాలోకి వెళ్ళింది. వారి కుటుంబ పరంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న చైతన్య హైస్కూల్ విద్యార్థులు రూ. 5000, చైతన్య హై స్కూల్ మేనేజ్‌మెంట్ రూ. 5,000 మొత్తం రూ. 10,000 భాగ్యలక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య హైస్కూల్ ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
సోమవారం 10 ఏప్రిల్ 2023

రెండో సచివాలయ భవన నిర్మాణం లేనట్టేనా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలుకు రెండో సచివాలయ భవన నిర్మాణం ఈ ఏడాది కూడా నిర్మించే దాఖలాలు కనిపించటం లేదు. రెండేళ్ల వరకు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం దొరకలేదని, దానికోసం అన్వేషించిన నాయకులు అధికారులకు గత ఏడాది విఠలేశ్వరనగర్‌లో ఉన్న కమ్యూనల్ స్థలాన్ని సంబంధిత అధికారులు సచివాలయ నిర్మాణానికి కేటాయించారు. దీంతో స్థలం ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదించటంతో సుమారు రూ.35 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీనిలో భాగంగా ప్రభుత్వ రాయితీతో 550 సిమెంట్ బస్తాలు కూడా సంబంధిత నిర్మాణదారునికి అందజేశారు. గత జూన్ నెలలో కేటాయించిన సిమెంట్ విడుదల కాగా నిర్మాణ పనులు ప్రారంభించేందుకు నిర్మాణదారుడైన జెడ్పిటిసి కాలయాపన చేయటంతో వర్షాలు ప్రారంభమై కాలనీలోకి నీరు ప్రవేశించి పనులకు ఆటంకంగా మారింది. దీంతో నీరు తగ్గేంతవరకు పనులు చేపట్టటం కుదరదని, నీరు తగ్గగానే పనులు ప్రారంభిస్తామని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కానీ నీళ్ల తగ్గిపోయి మూడు నెలలు గడిచినా నేటికీ పనులు ప్రారంభించకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీని కోసం మంజూరయిన సిమెంట్‌ను నిర్మాణదారుడు అధికారుల అండదండలతో వేరే పనులకు వినియోగించుకున్నాడు. ప్రస్తుతం సచివాలయం పనిని ప్రారంభించాలంటే బయట నుంచి సిమెంట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం రాయితీపై బస్తాకు రూ.235 కేటాయించింది. కానీ నేడు కొనుగోలు చేయాలంటే రూ.350 వెచ్చించాల్సి ఉంది. దీని కారణంగానే నిర్మాణదారుడు పనిని ప్రారంభించడం లేదని గ్రామస్థులు వ్యాఖ్యానిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏ పనికి కేటాయించిన సిమెంట్‌ను అదే పనికి వినియోగించాలి. కానీ దీనిని అన్యాక్రాంతం చేస్తున్నప్పటికీ సంబంధిత పిఆర్ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక సచివాలయానికి తన ఇంటినే అద్దెకు ఇవ్వడంతో.. ఇప్పుడు కొత్త భవనం నిర్మిస్తే అద్దె నష్టపోతామన్న తలంపుతో కొత్త భవనం నిర్మించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై పిఆర్ ఎఈ రామచంద్రరావు మాట్లాడుతూ సచివాలయ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో మంజూరు కావడం లేదని, దీనివలన నిర్మాణదారులు ముందుకు రావడం లేదని అన్నారు.



భట్టిప్రోలు 2వ సచివాలయం నిర్మించాల్సిన స్థలం

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రేపల్లె

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ విజయచంద్ర సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత రోడ్డు ప్రమాదాలకు గురికావడం బాధాకరమని అన్నారు. ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. యుక్త వయస్సులో ఉన్న తమ పిల్లలు ఎక్కడకు వెళ్లింది, ఏం చేస్తుందీ గమనించాలని అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో పిల్లలు వాహనాలను అతి వేగంగా నడపకూడదని, తల్లిదండ్రులు తగు సలహాలు ఇవ్వాలని సూచించారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. బైక్‌లను అతివేగంగా నడపటం, త్రిబుల్ రైడింగ్ చేయటం, రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోవటం ప్రమాదాలకు కారణం అన్నారు. వేసవి సెలవులు కావడంతో బంధువుల పిల్లలు రావటం వారితో పాటు సరదాగా గడపాలనే ఉదేశంతో చిన్నారులు ఈత సరదాతో సమీపంలోని కాలువలు, నదీ తీర ప్రాంతాలు, చెరువుల వద్దకు వెళుతుంటారని తెలిపారు. కుటుంబ సభ్యులు పిల్లలను గమనించుకోవాలని అన్నారు. ఒక్క క్షణంలో జరిగే పొరపాటు జీవితాల్లో పెను విషాదం కలిగిస్తాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ విజయచంద్ర

ఇది స్టిక్కర్ పాలన

అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

అభివృద్ధి చేయడం చేతకాక రంగులు, పేర్లు మార్చుకుంటూ జగన్‌రెడ్డి రాష్ట్రంలో స్టిక్కర్ పరిపాలన సాగిస్తున్నాడని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. నాలుగేళ్లపాటు ప్రజల్ని వంచించి నేడు నమ్మకం, భవిష్యత్ అంటూ బూటకపు మాటలు చెబుతున్నాడని ఆయన ఎండగట్టారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమం అంతా అబద్ధాలు, అంకెల గారడీ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రమంతా పాదయాత్ర చేసి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని వంచించిన జగన్‌రెడ్డి ఇప్పుడు జగన్ మా ధైర్యం అంటూ కొత్త నాటకాలకు తెరతీశారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేకుండా చేసి, వారిని మాదకద్రవ్యాలు, గంజాయికి బానిసల్ని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు, దళితులు, మైనారిటీల్ని హింసిస్తూ, న్యాయంగా వారికి దక్కాల్సిన వాటిని అందకుండా చేశారన్నారు. వాలంటీర్ వ్యవస్థతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్న జగన్ వారిని నమ్మకుండా, వారు మాత్రం తననే నమ్మాలనడం విడ్డూరంగా ఉందని అన్నారు. వాలంటీర్ వ్యవస్థపై నమ్మకంలేకే జగన్ వారిపై పెత్తనాన్ని గృహసారథులు, కన్వీనర్లకు అప్పగించాడు. టీడీపీ ప్రభుత్వం వాలంటీర్లను తొలగిస్తుందనేది వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఉన్న పథకాలకే పేర్లు మార్చడం.. కొత్తగా రంగులు వేయడం, జగన్ నేర్చుకున్న రాజకీయమని ఎద్దేవా చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, సబ్సిడీ రుణాలు, గిట్టుబాటుధర ఏవీ అందించలేని రైతు భరోసా కేంద్రాలు పెట్టి, వాటిముసుగులో కర్షకుల్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డ్వాక్రా రుణాలు ఒకేసారి మాఫీ చేస్తానని చెప్పి లబ్ధిదారుల సంఖ్యలో కోతపెట్టి, విడతలవారీగా ఇస్తున్నందుకు అక్కచెల్లెమ్మలు జగన్‌ను నమ్మే స్థితిలో లేరని అన్నారు. దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి మోసం చేశాడన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించి, ఆదరణ పథకం రద్దుచేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించి, వారిని రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతూ జగన్ దళితులు, గిరిజనులపై దమనకాండ కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు దళితుల కోసం తీసుకొచ్చిన విదేశీ విద్యను రద్దు చేయడం వైసిపి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని చెప్పారు. కిరణ్, డాక్టర్ సుధాకర్ సహా, వరప్రసాద్, విక్రమ్, ఓంప్రతాప్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం వంటి దళిత యువకుల్ని బలితీసుకున్నాడన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాలు, నకిలీ మద్యం అమ్మకాలతో పాటు జూద క్రీడలు, గుండాట, కేసినోలు, కోడిపందాలు వారి నేతల కనుసన్నల్లో నిర్వహించడమేనా జగన్ ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన అని ప్రశ్నించారు. నాలుగేళ్లపాటు ప్రజల్ని వంచించి, వారి జీవితాలు సర్వనాశనం చేసిన జగన్, ఇప్పుడు మరలా ప్రజల్ని నమ్మించడానికి జగనన్నే మా నమ్మకం, జగనే మా భవిష్యత్ అంటూ బూటకపు మాటలు చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మూడు పట్టభద్రుల స్థానాలు, ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ గెలిచాక జగన్ జనంలో నటించడం ఎక్కువైందని ఎద్దేవా చేశారు. సంక్షేమ క్యాలెండర్ పేరుతో జగన్ విడుదలచేసిన సమాచారం మొత్తం పచ్చి అబద్ధాలేనని ఎమ్మెల్యే గొట్టిపాటి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.



గొట్టిపాటి రవికుమార్

11 నుంచి పూలే, అంబేద్కర్ జయంత్యోత్సవాలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంత్యోత్సవాలను వాడవాడలా జరుపుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు ఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం నాడు సంతమాగులూరులో జరిగిన మండల కేఎన్‌పిఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ, దళిత బహుజనుల ఓట్ల కోసం అగ్రకుల మనువాద పాలకులు పోటీలు పడి పూలే, అంబేద్కర్ జయంత్యోత్సవాలు జరపడానికి ఉవ్విళ్లూరుతున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా పీడిత కులాల ప్రజలపై, పీడకవర్గాల అణిచివేత, దోపిడీలు, పూలే, అంబేద్కర్ కాలం నాటి కంటే, అధికంగా ఆధునిక పద్ధతులలో అమలవుతున్నాయన్నారు. దేశ ఖనిజ సంపదను, సహజ వనరులను, ప్రజల ఆస్తులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నాయన్నారు. తద్వారా చేతివృత్తులు ధ్వంసమయి కుటీర పరిశ్రమలు, చిన్న తరహా, స్వదేశీ పరిశ్రమలు కనుమరుగయ్యాయన్నారు. దీనివల్ల పీడిత కులాల ప్రజలు విద్య, వైద్యంతో పాటు ఉద్యోగాలు, ఉపాధికి దూరమయ్యారన్నారు. దేశ సకల సంపదలకు హక్కుదారులై 80 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఐక్యంగా ఉండి, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతులను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



పది పరీక్షల ఇన్విజిలేటర్లకు వెన్నులో చలి

ప్రజాశక్తి-బాపట్ల

పది పరీక్షల ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుల వెన్నులో చలి పుడుతోంది. మాస్ కాపీయింగ్ చేసే విద్యార్థుల కారణంగా ఇన్విజిలేషన్ బాధ్యత కత్తి మీద సాములా మారింది. ఇటీవల జరిగిన పదో తరగతి హిందీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందన్న ఆరోపణపై చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగిం చారు. ఓపెన్ టెన్త్ పరీక్షల్లో మరో ముగ్గురు ఉపాధ్యాయులపై వేటుపడటంతో ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మాస్ కాపీయింగ్‌కు పాల్పడే విద్యార్థులతో భయపడాల్సివస్తోంది. దీంతో ఇన్విజిలేషన్ నిర్వహణకు ఉపాధ్యాయు లు వెనుకడుగు వేస్తున్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌తో చేస్తున్న పొరపాట్లకు ఉపాధ్యా యులు బలి కావలసివస్తోందని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. కాపీ కొడుతూ పట్టుబడిన విద్యార్థితోపాటు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంతో ఉపాధ్యాయులు ఆలోచనలో పడుతున్నారు. విద్యార్థులు పరీక్ష ఉత్తీర్ణతే ప్రామాణికంగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఉపాధ్యాయులను బెంబేలెత్తిస్తు న్నారు. విద్యార్థులు మాస్ కాపీలకు పాల్పడ కుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. అదీ కాక పరీక్ష హాల్లోకి ప్రవేశానికి ముందు ప్రతి విద్యార్థినీ నిశితంగా పరిశీలించి మాస్ కాపీయింగ్‌ను సమూలంగా నిర్మిలించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు

- పొంచి ఉన్న ప్రమాదం - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ లోని ఐదవ వార్డులో తరచూ విద్యుత్ సమస్య నెల కొంటుంది. ఇటీవల అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే లోపం ఏమిటో తెలియదు కాని తరచూ వీధి లైట్లు కాలి పోతున్నాయి. గృహోపకర వస్తువులు పనికి రాకుండా పోతున్నాయి. వార్డులో కొన్ని విద్యుత్ స్తంభాలు నేల భాగంలో దెబ్బతిన్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో నని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నాసిరకం ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న కౌన్సిలర్ శ్రీనివాసులు


మార్కాపురం మున్సిపాలిటీ లోని ఐదవ వార్డులో అత్యధికంగా ఎస్‌సి జనాభా నివశిస్తోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన లోపంతో విద్యుత్ తరచూ హెచ్చు తగ్గులతో విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో ఇళ్లలోని గృహోపకర వస్తువులు కాలిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై ఆ వార్డు కౌన్సిలర్ మంగమూరి శ్రీనివాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. వీధిలైట్లు అమర్చిన రోజే మొత్తం కాలిపోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఆ వార్డులో వీధిలైట్లు వెలగని కారణంగా రాత్రుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. వార్డులో కొన్ని విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం జరగకముందే వాటి స్థానంలో కొత్తగా స్థంభాలు ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించు కోవడం లేదని కౌన్సిలర్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలోనూ విద్యుత్ సమస్యపై చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు నేటికీ పత్తా లేకుండా పోయారు.

'వాకపల్లి' ఘటన తీర్పు విచారకరం

- నిందితులను కఠినంగా శిక్షించాలి - ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-కొండపి

ఉమ్మడి విశాఖ జిల్లా వాకపల్లిలో 11 మంది మహిళలపై జరిగిన అమానుష అత్యాచార ఘటనలో సాక్ష్యాలు రుజువు కాలేదనే పేరుతో విచారణ ముగించటం అత్యంత విచార కరమని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. వాకపల్లి బాధితులకు న్యాయం జరగటం అంటే అత్యాచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించడ మేనని ఆమె తెలిపారు. వాకపల్లి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ మండల లపరిధిలోని పెరిదేపి గ్రామంలో కళ్లకు గంతలు కట్టుకొని ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 16 సంవత్సరాల క్రితం విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లిలో 11 మంది మహిళలపై 13 మంది గ్రేహౌండ్స్ పోలీసులు అమానుసంగా అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. దోషులను శిక్షించాలని ఇంతకాలంగా ప్రజా సంఘాల సహకారంతో అమాయక బాధిత మహిళలు అవమానంతో కృంగిపోతూనే పోరాడుతున్నట్లు తెలిపారు. పోలీసులు చేసిన అకృత్యాలపై విచారణకు పోలీసులనే నియమించటం వల్ల బాధితులకు న్యాయం జరగదని మహిళా సంఘాల ఆరోజే చేప్పాయన్నారు. నేడు అదే జరిగిందని తెలిపారు. సాక్ష్యాలను తారుమారు చేసి



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ఎలాంటి రుజువులు, ఆధారాలు అందుబాటులో లేకుండా దోషులను అధికారులు రక్షించారని స్వయంగా న్యాయ మూర్తి చెప్పారని, దీంతో కావాలనే కేసును నీరుగార్చారని స్పష్టమైందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలన్నారు. కేసు దర్యాప్తులో అధారాలు నీరుగార్చిన శివా నందరెడ్డి, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. దోషులకు శిక్ష పడకపోవడం, హత్రాస్ ఘటనలో దోషులను వదిలివేయటం, బిల్ కిస్‌భాను కేసులో దోషులకు క్షమాభిక్ష పెట్టడం లాంటి ఘటనలు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఊతమిస్తాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అత్యాచారమే జరగలేదని అధికార యంత్రాంగం పదేపదే కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు ఆమె తెలిపారు. కోర్టు విచారణలో అత్యాచారం జరిగినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారం వాకపల్లి బాధిత మహిళలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి అంగలకుర్తి మాధవి, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మల్లెల కొండయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, ఐద్వా నాయకులు ఎ.విశ్రాంతి, మల్లెల నిర్మల, ఎ.పరిమళ, లక్కెపోగు గంగమ్మ, ఎల్.కమలమ్మ, ఎ.అంజమ్మ, ఎ. మహాలక్ష్మమ్మ, బి.కరుణ, ఎ.సుబాషిణి, ఎం.నల్లమ్మ పాల్గొన్నారు.

'తీరం'లో కడలూరు బోట్లు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్రంలో వేట నిషేధం త్వరలోనే అమలులోకి రానుంది. ఈ నేపథ్యంలో స్థానిక మత్స్యకారులు బోట్లు తీయని పరిస్థితి. చెన్నై బోట్లు హద్దులు దాటి వచ్చి వేట సాగిస్తుంటే మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు చోద్యం చూస్తున్నారు.

తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన బోట్లు భారీ సంఖ్యలో ఆదివారం ఇక్కడి తీరంలోకి వచ్చాయి. వారం రోజుల క్రితం నెల్లూరు జిల్లాలో గొడవ జరగడంతో ఇక్కడి వచ్చారు. జిల్లాలోని ఊళ్ళపాలెం, పాకల, కొత్తపట్నం తీరానికి కడలూరు బోట్లు వచ్చాయి.

గతంలోనూ కొత్తపట్నం శింగరాయకొండ ప్రాంతంలో మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు కడలూరు బోట్లను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ వారు లెక్క చేయలేదు. ఇప్పుడు పదుల సంఖ్యలో వచ్చి వేట సాగిస్తున్నారు. తీరానికి 8 కిలోమీటర్ల దూరంలో వేట సాగించాల్సిఉంది. అయితే కడలూరు బోట్లు నిబంధనలకు తూట్లు పొడిచి తీరానికి అతి దగ్గరలోకి వచ్చారు. ఆ బోట్లను చూసిన స్థానిక మత్స్యకారులు ఏమిచేయాలలో పాలు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కడలూరు బోట్లను అరికట్టేందుకు గతంలో మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు స్పీడ్ బోట్ కోసం ప్రభుత్వాన్ని విన్నపించినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో కడలూరు బోట్లను పట్టుకోలేక పోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. శింగరాయకొండ మండల పరిధిలోని పాకల, చెల్లెమ్మగారిపాలెం, పోతయ్యగారిపాలెం, పల్లెపాలెం ప్రాంతాలకు కడలూరుకు చెందిన 28 బోట్లు వచ్చాయి. దీంతో స్థానిక మత్స్యకారులు ఆవేదనకు గురయ్యారు. అధికారులు స్పందించి కడలూరు బోట్లను అరికట్టాలని కోరారు.



తీరం సమీపంలోకి వచ్చిన కడలూరు బోట్లు

అధికారులు పట్టించుకోక పోవడం దారుణ

వాయిల గోవిందు, కాపు



తమిళనాడుకు చెందిన బోట్లు ఇక్కడి వచ్చి వేట సాగిస్తుంటే అధికారులు పట్టించుకోక పోవడం దారుణం. ఆదివారం పెద్ద సంఖ్యలో కడలూరు బోట్లు ఇక్కడి వచ్చాయి. ఈ విషయం గురించి అధి కారులకు చెప్పినా వారు స్పందించలేదు. కడలూరు బోట్లను కట్టడం చేయకపోతే గొడవలు జరిగే అవకాశం ఉంది.

స్పీడ్ బోటు ఏర్పాటు చేయాలి

ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు



కడలూరు బోట్లను అదుపు చేసేందుకు స్పీడ్ బోట్‌ను ఏర్పాటు చేయాలి. ప్రతిరోజు కడలూరు నుంచి బొట్లు వస్తున్నాయి. వాటిని అదుపు చేయడం కష్టం ఉంది. కడలూరు బోట్లను కట్టడి చేసేందుకు గతంలో రూ.13 లక్షలతో స్పీడ్ బోటు కొనుగోలు చేయాలని అధికారులు భావించారు. అది సాధ్యం కాలేదు. అధికారులు స్పందించి కడలూరు బోట్లను కట్టడి చేయాలి.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- చేతిపంపులకు మరమ్మతులు
- నిండిన తాగునీటి చెరువులు
- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విద్యాసాగర్

ముఖాముఖి

ప్రజాశక్తి -బాపట్ల



వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా గ్రామీణనీటి సరఫరా పారిశుధ్య విభాగం సూపరిం టెండెంట్ ఇంజినీర్ సిహెచ్. విద్యాసాగర్ తెలిపారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యల గురించి ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే....

జిల్లాలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు బాపట్ల, కర్లపాలెం, జె. పంగులూరు, కొరిశపాడు, అమతలూరు మండలాల్లో అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచామన్నారు. ఫిబ్రవరి నుంచి మార్చి వరకూ 45 రోజుల పాటు క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా చేతిపంపులు మరమ్మతుల చేపట్టారు. జిల్లాలో మొత్తం 9,708 చేతిపంపులు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో అన్ని తాగునీటి చెరువులను (సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు) నీటితో నింపారు. జిల్లాలో సిపిడబ్ల్యు స్కీములు 29, పిడబ్ల్యుఎస్ స్కీములు 366, ఎండబ్ల్యుఎస్ స్కీములు 37 ఉన్నాయి. డైరెక్ట్ పంపింగ్ స్కీములు బాపట్ల, రేపల్లె నియోజక వర్గాల్లో 372 ఉన్నాయి. ప్రస్తుతానికి జిల్లాలో నీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మండలాల వారీగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు తాజా పరిస్థితులపై సమీక్షించి నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడు తున్నామన్నారు. బాపట్ల, చిన్నగంజాం సముద్ర తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాం. ప్రధానంగా అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో అన్ని చెరువులను నీటితో నింపి ఆయా నియోజకవర్గాల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. డెల్టా ప్రాంతంలోని వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో ఇప్పటికే చెరువు లను నింపాం. 25 మండలాల్లో అత్యవసర పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన హెబిటేషన్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. బాపట్ల మండలంలో స్టూవర్టుపురం, బేతపూడి ,వెదుళ్ళపల్లి గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరాకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా స్కీం పనులు పూర్తి చేసి గ్రామ పంచాయతీలకు అప్పగించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పైప్ లైన్లు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వాటిని పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టి స్కీము సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.